సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో నియామకాలు

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విశాఖ దక్షిణ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆ పార్టీ అనుబంధ సంఘాలకు నూతన అధ్యక్షులను నియమించారు. నియోజకవర్గ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా వాక తులసి కృష్ణకుమార్, గ్రీవెన్సెల్ అధ్యక్షుడిగా మళ్ల వెంకట విజయ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

అంచనాలు రూపొందించాం

- అధికారుల వెల్లడి

సాక్షి ఎఫెక్ట్..

అల్లిపురం: జీవీఎంసీ 33, 34 వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 15న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అపారిశుద్ధ్యంతో అవస్థలు' కథనానికి జీవీఎంసీ జోన్ – 4 అధికారులు స్పందించారు. గోవిందరోడ్డులో కాలువ, కాలువతో పాటు ఫుట్‌పాత్ నిర్మాణానికి ఒక వైపు రూ.18.96 లక్షలు, కాలువ లేని మరొకవైపు కాలువ, ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ.32.60 లక్షలు అంచనాలు రూపొందించినట్లు సోమవారం విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. అదే విధంగా 34వ వార్డు కేరళ మసీదు వద్ద కల్వర్టుపై పలకల ఫిర్యాదును ఇంజినీరింగ్ విభాగానికి తెలియజేశామని వివరించారు. కాలువల పూడికలు తొలగించారని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రికి స్వాగతం



యోగా దినోత్సవ ఏర్పాట్లు పరిశీలించేందుకు సోమవారం విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు విమానాశ్రయంలో స్వాగతం పలుకుతున్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు - డాబాగార్డెన్స్

డయేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: అతిసార వ్యాధి నివారణ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు సూచించారు. డయేరియాపై అవగాహన కల్పిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు నిర్వహించిన ర్యాలీని సోమవారం ఆయన ప్రారంభించారు. రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో జిల్లా కార్యాలయం నుంచి సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈనెల 16 నుంచి జూలై 31 వరకు జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ బి.లూసీ కార్డిలియా, జిల్లా ఆస్పత్రి సేవా సమన్వయకర్త డాక్టర్ పి. శంకర ప్రసాద్, జిల్లా ప్రోగ్రాం అధికారులు, పారా మెడికల్ సిబ్బంది, ప్రభుత్వ ప్రాంతీయ శిక్షణ కేంద్ర నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

విమాన ప్రమాద మృతులకు వైద్య విద్యార్థుల నివాళి



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న వైద్య విద్యార్థులు

మహారాణిపేట: అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మృతి చెందిన వైద్య విద్యార్థులకు ఆంధ్ర మెడికల్ కళాశాల విద్యార్థులు అంజలి ఘటించారు. ఏఎంసీ ఎదుట సోమవారం సాయంత్రం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఎయిర్ ఇండియా విమానం మెడికల్ కళాశాల భవనంపై కూలడంతో అనేకమంది వైద్య విద్యార్థులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విమాన ప్రమాద మృతులకు నివాళులర్పిస్తూ సోమవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ వద్ద మొదలైన ప్రదర్శన కేజీహెచ్ వరకు సాగింది. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, వైద్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చిక్కులు



అలయాన్ని ఆనుకుని ఉన్న సబ్‌వే గోతులమయం



జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న భారీ వాహనాలు



ఎర్నిమాంబ ఆలయం వద్ద ప్రధాన రహదారిలో పార్క్ చేసిన వాహనాలు

- ఎర్నిమాంబ ఆలయం వద్ద అస్తవ్యస్తంగా పార్కింగ్
- ఆదివారం వస్తే మరింత రద్దీ, గందరగోళం
- బీఆర్‌టీఎస్ సబ్‌వే మూసివేతతో రాకపోకలకు అవస్థలు
- ప్రమాదాల బారిన భక్తులు, పాదచారులు
- స్పందించని ట్రాఫిక్ పోలీసులు



సబ్‌వే మూసి, రహదారిలో టెంట్లు, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్న దృశ్యం

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం నుంచి కాన్వెంట్ కూడలికి వెళ్లే రహదారిలో వాహనాల అక్రమ పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంగళ, బుధ, శుక్రవారాల్లోనూ పార్కింగ్ అవస్థలున్నా.. ఆదివారం వస్తే మాత్రం ఆ మార్గంలో ప్రయాణం సహనానికి పరీక్షగా మారుతోంది. సబ్‌వేతో పాటు బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలోనూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు పార్క్ చేసి భక్తులు ఎర్నిమాంబ అమ్మవారి దర్శనాలకు వెళ్తుంటారు. దర్శనాలు చేసుకుని వచ్చే రావడానికి సుమారు గంట సమయం పడుతుండగా.. ఆ సమయంలో ప్రధాన రహదారిలో భారీ వాహనాలు ట్రాఫిక్ దిగ్బంధంలో చిక్కుకుపోయి, వాహనాల హారన్ మోతలతో రహదారి గందరగోళంగా మారుతోంది. అటు సెయింట్ జోసెఫ్ చర్చిల్లోనూ, ఇటు ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలోనూ భక్తులు ప్రార్థనలు, పూజలు చేసుకునేందుకు ఆటంకం కలుగుతోందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ద్విచక్ర వాహనదారుల తొందరపాటు భక్తులకు శాపంగా మారుతుంది. వాహనాల వేగానికి పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రశాంతత మాటెలా ఉన్నా ఆదివారం వచ్చేసరికి ఆలయ పరిసరాలు ధ్వని కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయి.

రహదారి మూసేయడమే ప్రధాన సమస్య

జ్ఞానాపురం రైల్వే స్టేషన్ రహదారి నుంచి కాన్వెంట్ కూడలికి వెళ్లే బీఆర్‌టీఎస్ సబ్‌వేను ఆదివారం మూసివేసి రహదారుల్లో భారీ టెంట్లు వేసి వ్యాపారాలు చేయడమే ప్రధాన సమస్యగా మారుతోంది. సబ్‌వేలో వాహనాల పార్కింగ్‌కు చోటు ఉంచితే బాగుండేదని పలువురు చెబుతున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగుతున్నాయి. దేవదాయశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇక్కడ వ్యాపారాలు జరుగుతుండడంతో పార్కింగ్ సమస్య తలెత్తుతోందని పలువురు విమర్శిస్తున్నారు. దీంతో వాహనాలను బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారుల్లో అడ్డదిడ్డంగా పార్క్ చేసి భక్తులు వెళ్లిపోవడంతో వాహనదారులు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో గుంతలమయంగా మారిన రహదారుల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని పలువురు వాహనచోదకులు, భక్తులు కోరుతున్నారు.

అడ్డదిడ్డంగా పార్క్ చేస్తున్నారు

ఆలయానికి వచ్చే భక్తులు వాహనాలను అడ్డదిడ్డంగా పార్క్ చేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. ఆలయ నిర్వాహకులు పార్కింగ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాదచారులు కూడా రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.

– పి.గోవిందరాజులు, వాహనదారుడు, కంచరపాలెం

ట్రాఫిక్ పోలీసులెక్కడ?

ఎర్నిమాంబ ఆలయం దేవదాయ శాఖ అధీనంలో ఉన్నా.. వేలసంఖ్యలో భక్తులు వస్తున్నా కనీస పోలీస్ బందోబస్తు కనిపించదు. వాహనాల రద్దీని నియంత్రించడానికి ట్రాఫిక్ పోలీసులు కానరారు. ఆదివారం సమయంలో సిబ్బంది అంతంత మాత్రంగా కనిపిస్తున్నారు. ఇక్కడి రద్దీని దృష్టిలో ఉంచుకుని మరింతమంది పోలీసులను ఏర్పాటు చేయాలి. – ఒ.మధుసూదన్‌రావు, స్థానికుడు, జ్ఞానాపురం

అధికారులు స్పందించాలి

సబ్‌వేలో బారికేడ్లు అడ్డంగా పెట్టడంతో వాహనాల రాకపోకలు కష్టతరమవుతున్నాయి. సబ్‌వే లో వాహనాల పార్కింగ్‌కు చోటు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌కు ఆటంకం ఉండదు. అధికారులు స్పందించి, ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– ఆర్ గోపాల్‌రావు, స్థానికుడు, రైల్వేక్వార్టర్స్, కాన్వెంట్ కూడలి

వృద్ధురాలికి ఆశ్రయం



ఆశ్రయం కల్పించిన వృద్ధురాలితో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

అల్లిపురం: తల్లి మరణించడంతో ఒంటరి అయిన ఒక వృద్ధురాలికి ఏయూటీడీ సిబ్బంది నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించారు. వివరాలివి.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన షావుకారు విజయ (62), నగరంలో తాటిచెట్లపాలెంలో తల్లితో కలిసి ఉండేవారు. తల్లి ఈ మధ్యనే కాలం చేయడంతో, బంధువులు ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో విజయ ఒంటరిగా ఉంటోంది. అంగన్‌వాడీ సెంటర్ మెట్ల మీద ఐదు రోజులుగా కూర్చుని ఉండడంతో అంగన్‌వాడీ టీచర్లు ఏపీడీ పుణ్యవతికి, ఏయుటీడీ సెక్రటరీ ప్రగడ వాసుకు సమాచారం ఇచ్చారు. ఏపీడీ పుణ్యవతి ఇచ్చిన సమాచారంతో ఏయూటీడీ సిబ్బంది ఆమెను అక్కడి నుంచి తీసుకొచ్చి టీఎస్సార్ కాంప్లెక్స్‌లో గల ఏయుటీడీ మహిళల వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు.

నిత్యాన్నదాతకు సత్కారం



శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు

డాబాగార్డెన్స్: కాశీ పుణ్యక్షేత్రంలో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీరామమూర్తిని స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కాశీ పుణ్యక్షేత్రం హనుమాన్ ఘాట్ వద్ద క్షత్రియ సేవా సంఘం ప్రతినిధి శ్రీరామమూర్తి కాశీకి వచ్చిన వారికి సులభరీతిన వసతి కల్పించడమే గాక, ఉచితంగా అన్నదానం నిర్వహిస్తున్నారన్నారు. ఆయన సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేసిన ఆయన 2000 సంవత్సరం నుంచి కాశీకి వచ్చిన భక్తులకు సేవలందిస్తున్నారని తెలిపారు. ఏడాదిలో 4 సార్లు కాశీకి వెళ్లే వివేకానంద సంస్థ ఆశ్రమవాసులకు క్షత్రియ సేవా సంఘంలో ఉచితంగా భోజనాలు, వసతి ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

గృహ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షుడు కనకారావు

డాబాగార్డెన్స్: ఐఎల్‌వో కన్వెన్షన్ నెం.189 ఒప్పందం ప్రకారం గృహ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత వంటివి ఇతర వర్గాల కార్మికుల మాదిరిగానే అమలు చేసేందుకు సమగ్ర చట్టం చేయాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఫ్రీ ట్రేడ్ యూనియన్స్ ఆఫ్ ఇండియా (సీఎఫ్‌టీయూఐ) జాతీయ అధ్యక్షుడు ఎస్.కనకారావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 15వ అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా సీఎఫ్‌టీయూఐ ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో గృహ కార్మికుల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని కార్మిక సంఘాల్లో అత్యధిక సంఖ్యలో గృహ కార్మికులకు సీఎఫ్‌టీయూఐ ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. గృహ కార్మికుల స్థితిగతులు పరిశీలించడానికి, తగిన శాసనపరమైన చర్యలు సిఫార్సు చేయడానికి నిపుణుల కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నెంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

కేజీహెచ్‌కు రూ.8 లక్షల పరికరాల వితరణ

డాక్టర్ బాలపరమేశ్వరరావు జ్ఞాపకార్థం అందించిన ఆయన కుమార్తె



బాల పరమేశ్వరరావు కుమార్తె ఇచ్చిన పరికరాలను పరిశీలిస్తున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణి

మహారాణిపేట: కేజీహెచ్ న్యూరోసర్జరీ విభాగానికి దివంగత సుంకర బాలపరమేశ్వరరావు కుమార్తె సుంకర ఆదిలక్ష్మి 8 లక్షల రూపాయల విలువైన ఆపరేషన్ థియేటర్ (వోటీ) పరికరాలను విరాళంగా అందించారు. న్యూరోసర్జరీ పితామహుడిగా కీర్తి పొందిన సుంకర బాలపరమేశ్వరరావు జ్ఞాపకార్థం ఈ విరాళం ఇస్తున్నామన్నారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ ఈ పరికరాలు న్యూరోసర్జరీ విభాగానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పరికరాల ద్వారా రోగులకు మరింత మెరుగైన సేవలు అందించడం వీలవుతుందన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ న్యూరోసర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ప్రేమ్‌జిత్ రే, ప్రొఫెసర్ డాక్టర్.బి.హయగ్రీవరావు, న్యూరోసర్జరీ విభాగ వైద్యులు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్.జి.మెహర్ కుమార్ మరియు అనస్థీషియా(హెచ్‌వోడి)విభాగాధిపతి డాక్టర్ వి.రవి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఏడాది పాలనంతా దగా.. మోసమే

- సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేసేశారట..
- బాబు, లోకేష్ మాటలు విడ్డూరం
- ప్రభుత్వ పాలసీల్లో పవన్‌కు చోటేది?
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: చంద్రబాబు ఏడాది పాలనంతా మోసం, దగా, కుట్ర రాజకీయాలే తప్ప మరొకటి లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ విమర్శించారు. 'జగన్ అంటే నమ్మకం..బాబు అంటే మోసం' పేరిట రూపొందించిన పుస్తకాన్ని ఆశీల్‌మెట్ట కార్యాలయంలో వాసుపల్లి సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏడాదిలోనే చంద్రబాబు చేసిన కుట్ర రాజకీయాలు 200 పేజీలు వస్తే.. ఐదేళ్లలో వెయ్యి పేజీలు దాటేస్తాయేమో అన్నారు. సూపర్ సిక్స్ కొట్టకుండానే పథకాలన్నీ అమలు చేసేశామని చంద్రబాబు, లోకేష్ నిసిగ్గుగా చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ప్రభుత్వ పాలసీల్లో ప్రమేయం లేకుండానే అమలు చేస్తుండడం జనసేన నాయకులకు పాపం మింగుడు పడడం లేదన్నారు. ఇప్పటి వరకు చంద్రబాబుతో కలిసి వెళ్లే పార్టీలన్నీ భూస్థాపితం అయిపోయాయని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలేమీ అమలు చేయకుండా ఏడాది పండగలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబుకు మేనిఫెస్టో అంటే చెత్తబుట్టని మాత్రమే తెలుసన్నారు. మేనిఫెస్టోను పవిత్రగ్రంథంగా భావించి ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డని కొనియాడారు. రాష్ట్రంలో పసికందులపై లైంగికదాడులు..దోపిడీలు, దుర్మార్గాలు పెచ్చు మీరుతున్నాయన్నారు. ప్రశ్నించే ప్రతిపక్షాన్ని, సోషల్ మీడియాలో నిలదీస్తున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేయించి, లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. విద్య, వైద్యంతో పాటు పారిశ్రామిక, ఇతర రంగాలు కూడా చతికిలపడ్డాయన్నారు. కరోనా సమయంలో కూడా జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో 8.9గా ఉన్న జీడీపీ రేటు చంద్రబాబు ఏడాది పాలనలో దేశంలోనే చివరి రాష్ట్రంగా 3.9కి పడిపోయిందన్నారు.

పవన్ ఓ పోస్టర్..

విశాఖలో జరుగుతున్న గ్లోబల్ లెవెల్ యోగా డే వేడుకల్లో ఎక్కడా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రమేయం లేకుండా కేవలం పోస్టర్ మాదిరిగా వాడుకుంటున్నారని విమర్శించారు. అంతా వారిద్దరే (చంద్రబాబు..లోకేష్) పాలన సాగిస్తున్నారన్నారు. రూ.75 కోట్లు ఖర్చు చేస్తున్న ఈ కార్యక్రమంలో పవన్ ఒక ఫ్లెక్సీకి మాత్రమే పరిమితమయ్యాడని తెలిపారు. కూటమిలో ఓ భాగమైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి కూడా నోరు మెదపకపోవడం చూస్తుంటే..తండ్రి కొడుకుల రాజకీయం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, బిపిన్‌కుమార్ జైన్, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకులు ఆకుల శ్యామ్‌కుమార్, పీతల వాసు, దశమంతుల మాణిక్యాలరావు, దశమంతుల చిన్ని, సౌత్ ఆర్‌టీఐ ప్రెసిడెంట్ దొడ్డి బాపూ ఆనంద్, రాజారెడ్డి, ముత్తాబత్తుల రమేష్, అలపున కనకారెడ్డి, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, లండా రమణ, బోర విజయలక్ష్మి, లింగం శ్రీను, బోర శ్రీనివాసరెడ్డి, వడ్డాది దిలీప్‌కుమార్, ఆరుగుల రాజు, చంద్రమౌళి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

2.5 కిలోల గంజాయి పట్టివేత



ఎక్సైజ్ అధికారుల అదుపులో గంజాయి, రవాణాదారుడు

విశాఖ సిటీ: ఒడిశా నుంచి బెంగుళూరుకు గంజాయి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని ఎక్సైజ్ శాఖ అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వి.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ సిబ్బంది జ్ఞానాపురంలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రాజేష్ అనే వ్యక్తి వద్ద 2.5 కిలోల గంజాయిని గుర్తించారు. అతడిని విచారించగా.. ఒడిశా రాష్ట్రంలో దర్లిపుట్ నుంచి కేజీ రూ.5 వేలకు కొనుగోలు చేసి అధికంగా అమ్ముకునేందుకు బెంగళూరుకు వెళ్తున్నట్లు చెప్పాడు. దీంతో అతడిని అరెస్టు చేసి సీతమ్మధార ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సిహెచ్.రాజేశ్వరి, ఎస్ఐ ఎల్.అరుణకుమారి, హెచ్‌సీ కె.వెంకటరావు, కానిస్టేబుళ్లు కె.వీరభద్రరావు, జి.విజయ్‌కుమార్, ఎ.దేవీచంద్ర, ఎస్.తిరుపతిరావు, ఎం.మహేశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన ఆత్మరక్షణ వేసవి శిక్షణ శిబిరం



బాక్సింగ్, కిక్‌బాక్సింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు

డాబాగార్డెన్స్: స్థానిక ఏవీఎన్ కళాశాలలో నెల రోజులుగా నిర్వహించిన సెల్ఫ్ డిఫెన్స్ సమ్మర్ ట్రైనింగ్ క్యాంప్ సోమవారంతో ముగిసింది. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రేవతి ప్రశంసాపత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ఆడ పిల్లలకు ఆత్మరక్షణ విద్య నేర్చుకోవడం అత్యంత అవసరమన్నారు. శారీరకంగా, మానసికంగానే గాక శక్తివంతులుగా ఉండేందుకు సహాయపడుతుందని చెప్పారు. శిక్షణ శిబిరంలో బాక్సింగ్, కిక్‌బాక్సింగ్ వంటి వాటిలో విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. ఏపీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆనంద్ బాలు, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్లు వి.లక్ష్మీపతి, వడ్డాది సురేష్ నేతృత్వంలో విద్యార్థులు బాక్సింగ్, కిక్‌బాక్సింగ్‌లో శిక్షణ పొందారు. శిక్షణలో ప్రతిభ చూపిన బాలబాలికలు జూలై 13న జరగనున్న స్టేట్ లెవెల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్టు వారు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

అఖిలపక్ష కార్మిక సంఘాల డిమాండ్



జగదాంబ జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల ప్రతినిధులు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు మద్దతుగా జగదాంబ జంక్షన్లో అఖిలపక్ష కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామన్న కూటమి ప్రభుత్వ పెద్దలు కార్మికుల ఉపాధినే కాపాడలేకపోయారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌లో అదనంగా 6 వేల మంది కార్మికులు అవసరం ఉన్నా, పనిలో ఉన్న 4500 మంది కార్మికులను అక్రమంగా తొలగించడాన్ని తప్పుబట్టారు. కార్మికులు తమ ఉపాధి రక్షణకు పోరాడుతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కక్షపూరితంగా వ్యవహరించి బెదిరింపులతో ఉద్యమాన్ని అణిచివేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న విశాఖ వస్తున్న ప్రధాని మోదీతో స్టీల్‌ప్లాంట్ రక్షణ, కార్మికుల ఉపాధిపై ప్రకటన చేయించాలని కోరారు. నిరసనలో ఏపీఎఫ్‌టీయూ నాయకుడు కె.దేవా, సిటూ నాయకులు పి.వెంకట్‌రెడ్డి, పి.మణి, సుబ్బారావు, పి.వెంకట్రావు, వి.నరేంద్రకుమార్, ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే రెహ్మాన్, సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకుడు వెంకటరమణ, డీవైఎఫ్ఐ నాయకురాలు డి.ఉమాశైలజ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలకు సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ–లీగల్: న్యాయ స్థానాలలో వయోవృద్ధులకు సంబంధించిన వివాదాలు త్వరితగతిన పరిష్కారం కానున్నట్టు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు స్పష్టం చేశారు. సోమవారం కోర్టు ఆవరణలో ప్రపంచ వయోవృద్ధుల వేధింపులపై అవగాహన దినోత్సవాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టంలోని పలు కీలక అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా న్యాయ పీఠం అధ్యక్షులు జి.వల్లభనాయుడు, జిల్లా దివ్యాంగులు, వయోవృద్ధుల సంరక్షణ అధికారి కె.కవిత, సామాజిక కార్యకర్త ఎం.సత్యనారాయణ, న్యాయసేవాధికార సంస్థ ప్యానెల్ న్యాయవాదులు, పారా న్యాయ సహాయకులు,వృద్ధులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ సౌత్

9010810033, 7075989701

Office mail : sakshiadvtvsp@gmail.com